# భారత్.. అంతర్జాతీయ వాణిజ్యం!

**స్వాతంత్ర్యానికి పూర్వం భారత్ ఏ దేశాలతో వాణిజ్య సంబంధాలు నిర్వహించాలో.. బ్రిటిష్ ప్రభుత్వమే నిర్ణయించేది. అప్పట్లో భారతదేశ వాణిజ్యం ఎక్కువగా బ్రిటన్, దాని వలస దేశాలతోనే జరిగేది. 1950-51లో మన దేశ ఎగుమతుల ఆదాయంలో.. బ్రిటన్, అమెరికాల వాటా 42 శాతం. కాగా, మొత్తం దిగుమతుల వ్యయంలో ఈ రెండు దేశాల వాటా 39.1 శాతంగా ఉండేది.**

ప్రపంచ వాణిజ్య సంస్థ గణాంకాల ప్రకారం.. ప్రపంచ వస్తు వాణిజ్య వృద్ధి (స్థిర ధరల వద్ద) 2005లో 6.5 శాతం నుంచి 2006లో 8 శాతానికి పెరిగింది. భారతదేశ ఎగుమతులకు ప్రధాన మార్కెట్ అయిన అమెరికా దిగుమతుల వృద్ధి 2005లో 6 శాతం. కాగా అది 2006లో 5.5 శాతానికి తగ్గింది. చైనా వస్తు ఎగుమతుల వృద్ధి 2004లో 24 శాతం నుంచి 2005లో 25 శాతానికి పెరిగి.. 2006లో 22 శాతానికి తగ్గింది. భారతదేశ వస్తు ఎగుమతుల వాణిజ్య వృద్ధి 2004లో 15.5 శాతం నుంచి 2005లో 20.5 శాతానికి పెరిగి.. 2006లో 11.5 శాతానికి తగ్గింది. 2004తో పోల్చినపుడు 2006లో చైనాకు, భారత్‌కు సంబంధించి వస్తు దిగుమతుల వృద్ధిలో తగ్గుదల కనిపిస్తోంది. చైనా వస్తు దిగుమతుల వాణిజ్య వృద్ధి 2004లో 21.5 శాతం నుంచి 2006లో 16.5 శాతానికి తగ్గింది. భారతదేశ వస్తు దిగుమతుల వాణిజ్య వృద్ధి ఇదే కాలానికి సంబంధించి 16 శాతం నుంచి 12 శాతానికి తగ్గింది. ప్రపంచ వాణిజ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాల వాటా పెరుగుతోంది. మొత్తం ప్రపంచ ఎగుమతులలో 2006లో ఈ దేశాల వాటా 45.3 శాతానికి చేరుకోగా.. 2007 (జనవరి-జూన్)లో 45 శాతంగా ఉంది. ప్రపంచ వస్తు ఎగుమతులలో భారత్ వాటా 2003, 2004లలో 0.8 శాతం. కాగా, 2006లో, 2007వ సంవత్సరం మొదటి ఆరు నెలల్లోనూ 1 శాతానికి చేరుకుంది. 2001 నుంచి 2007 మధ్యకాలంలో ప్రపంచ ఎగుమతులలో చైనా వాటా 4.1 శాతం మేర పెరిగింది. 2006లో చైనా ఎగుమతులలో 27 శాతం వృద్ధి నమోదైంది. 2007లో మొదటి ఆరు నెలల్లోనూ అదే వృద్ధి కనిపించగా.. భారత్‌లో మాత్రం ఎగుమతుల వృద్ధి తక్కువగా ఉంది. ఇటీవలి కాలంలో మన దేశ ఎగుమతుల విలువ కన్నా.. థాయ్‌లాండ్, బ్రెజిల్ ఎగుమతుల విలువ, ఎగుమతుల వృద్ధిరేటు ఎక్కువగా ఉంది.

## భారత వాణిజ్య భాగస్వాములు:

భారతదేశ మొత్తం వాణిజ్యంలో 11 అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల వాటా సుమారు 50 శాతంగా ఉంది. 2000-01 నుంచి మన దేశంతో అతిపెద్ద వ్యాపార భాగస్వామిగా అమెరికా కొనసాగుతున్నప్పటికీ.. మొత్తం వాణిజ్యంలో ఆ దేశ వాటాలో తగ్గుదల ధోరణి కనిపిస్తోంది. 2000-01 తర్వాత చైనా వాటా 3 రెట్లు పెరిగింది. 2వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా కొనసాగుతుండగా.. 3వ భాగస్వామిగా యుఏఇ ఉంది. 2000-01లో మన దేశ మొత్తం వాణిజ్యంలో చైనా వాటా 2.5 శాతం. కాగా

2005-06లో 7 శాతం. ఇదేకాలంలో యుఏఇ వాటా 3.4 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగింది. ఇటీవల కాలంలో బెల్జియం, హాంకాంగ్ దేశాల వాటాలో తగ్గుదలకు వజ్రాలు, ఆభరణాల ఎగుమతుల, దిగుమతులు తగ్గడమే కారణంగా కనిపిస్తోంది.

### ఎగుమతులు:

రెండో ప్రపంచ యుద్ధానికి ముందు దేశ ఎగుమతులు ఎక్కువగా.. దిగుమతులు తక్కువగా ఉండేవి. అందుకు ఆంగ్లేయుల పాలన విధానాలే కారణం. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో.. మన దేశం నుంచి ఎక్కువ వస్తువులు బ్రిటన్‌కు ఎగుమతి అయ్యేవి. కాని, మన డిమాండ్‌కు తగిన వస్తువులు మాత్రం దిగుమతి కాలేదు. 1938-39 నుంచి 1947-48 వరకు ఎగుమతుల విలువ.. దిగుమతుల విలువ కన్నా ఎక్కువైనప్పటికీ.. రెండింటి విలువల్లోను పెరుగుదల సంభవించింది. ఎగుమతయ్యే వస్తువుల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. మొత్తం ఎగుమతులలో ముడిసరుకుల వాటా .. 1938-39లో 45 శాతం. కాగా అది 1947-48లో 31 శాతానికి తగ్గింది. ఇదేకాలంలో తయారీ ఉత్పత్తులు 30 నుంచి 49 శాతానికి తగ్గాయి. యుద్ధ కాలానికి ముందు గోధుమలు, గోధుమ పిండి, బార్లీ, పప్పుధాన్యాలు ఎగుమతి కాగా... స్వాతంత్ర్యానంతరం జనాభా పెరగడంతో ఈ మిగులు కనిపించలేదు. 1938-39 నుంచి 1947-48 మధ్యకాలంలో... మన దేశ ఎగుమతులలో కామన్‌వెల్త్ దేశాల వాటా 54 శాతం. కాగా, బ్రిటన్ వాటా 34 శాతం, జపాన్ 9 శాతం, అమెరికా వాటా 8 శాతంగా ఉంది.

ఎక్కువ ఎగుమతులు, తక్కువ దిగుమతులు భారతదేశ విదేశీ వాణిజ్యంలో వాణిజ్య శేషం మిగులుకు కారణమైంది. 1946, ఏప్రిల్ 1లో వాణిజ్య శేషంలో మిగులు రూ. 1733 కోట్లు. అంటే.. విదేశీ వాణిజ్యంలో మన దేశానికి అనుకూలత కనిపిస్తుంది. యుద్ధం వల్ల రక్షణ విధానం అవలంభించడంతో.. మన దేశంలో వినియోగ వస్తు పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. పాశ్చాత్య దేశాలు, మధ్య, తూర్పు ప్రాంతాలలో సంబంధాలు ఏర్పడటంతో.. ఈ దేశాలలో మన ఉత్పత్తులు విక్రయించడానికి.. వినియోగవస్తు పరిశ్రమల అభివృద్ధికి ముడి సరుకులను దిగుమతి చేసుకొనేందుకు మనకు అవకాశం కలిగింది. 1991 తర్వాత సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో.. వ్యాపార రంగంలో ప్రైవేటు రంగ జోక్యం పెరిగి, పోటీతత్వం నెలకొంది. దాంతో ఎగుమతి, దిగుమతుల్లో అనేక మార్పులు జరిగాయి. తర్వాత కాలంలో పశ్చిమాసియా దేశాలలో.. వాణిజ్య ధోరణులు సన్నగిల్లడం.. జపాన్‌లో తిరోగమన ఫలితాలు.. ప్రపంచ వాణిజ్యం 2 శాతం వృద్ధి నమోదు కావడం లాంటి పరిస్థితులు మన దేశ, విదేశీ వ్యాపారంపై ప్రభావం చూపాయి. అందువల్ల మన విదేశీ వాణిజ్యంలో తగ్గుదల ఏర్పడింది. భారతదేశ ఎగుమతుల సగటు వార్షికవృద్ధి 2000 నుంచి 2006 మధ్యకాలంలో.. 19.3 శాతానికి పెరగడానికి టెక్స్‌టైల్స్, పెట్రోలియం ఉత్పత్తులు అధిక వృద్ధి సాధించడమే కారణం.

### రెట్టింపు వాణిజ్య లక్ష్యం:

టెక్స్‌టైల్స్, రెడీమేడ్ గార్మెంట్స్ వాటా మొత్తం ఎగుమతులలో 2000-01తో పోల్చినపుడు 2006-07లో

11.1 శాతం తగ్గింది. వజ్రాలు, ఆభరణాలు, తోలు, సంబంధిత తోలు ఉత్పత్తులు కూడా తగ్గాయి. ఇదేకాలంలో ఇంజినీరింగ్ వస్తువుల వాటా 7.6 శాతం, పెట్రో ఉత్పత్తుల వాటా 10.7 శాతం పెరిగింది. ప్రాథమిక ఉత్పత్తుల వాటాలో తగ్గుదల కన్పించగా.. రసాయనాలు, పెట్రో కెమికల్స్ వాటా పెరిగింది. 2007-08లో మొదటి అర్ధభాగంలో.. పెట్రోలియం క్రూడ్, ఉత్పత్తుల వాటా 18 శాతం పెరగ్గా... ఇంజినీరింగ్ వస్తువుల వాటాలో కూడా పెరుగుదల కనిపిస్తోంది. భారత ప్రభుత్వం ఆగస్టు 2004లో ప్రకటించిన విదేశీ వాణిజ్య విధానం (2004-09) ప్రకారం.. భారతదేశ వస్తు వాణిజ్యం రాబోయే ఐదేళ్లలో రెట్టింపు వృద్ధి సాధించాలి. ప్రభుత్వం విదేశీ వాణిజ్యానికి ప్రోత్సాహకర వాతావరణం కల్పించింది. దాంతో 2001-02 నుంచి 2006-07 మధ్య ఎగుమతులు పెరిగాయి. ఎగుమతులు 2002-03 నుంచి వరుసగా.. 20 శాతం వార్షిక వృద్ధి సాధించగా... 2006-07లో 22.6 శాతం వృద్ధి నమోదైంది. 2007 ఏప్రిల్- డిసెంబర్ మధ్యకాలంలో.. వస్తు ఎగుమతుల విలువ 111 బిలియన్ డాలర్లకు చేరుకొని 21.6 శాతం అయింది. 2007-08లో ఎగుమతుల లక్ష్యం 160 బిలియన్ డాలర్లు. కాగా మొదటి 9 నెలల కాలంలో లక్ష్యంలో 69.4 శాతం సాధించారు.

**దిగుమతులు:**

స్వాతంత్ర్యానంతరం భారీ పారిశ్రామికీకరణ లక్ష్యంతో..యంత్రాలు, యంత్ర పరికరాల దిగుమతులు పెరగడం.. రక్షణ వస్తువుల కొనుగోలు.. అంతర్జాతీయ చమురు ధరలు పెరగడం వంటి కారణాల వల్ల దిగుమతుల విలువలు పెరిగాయి. ఒకటి లేదా రెండు సంవత్సరాలు మినహా మిగతా కాలంలో వాణిజ్య శేషం, చెల్లింపుల శేషంలో భారత్ ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంది. వస్తు దిగుమతులు 2006-07లో 24.5 శాతం పెరిగి, 185.7 బిలియన్ డాలర్లకు చేరుకోవడానికి... పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులు 30 శాతం, నాన్ పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులు 22.2 శాతానికి చేరుకోవడమే కారణం. 2007 (ఏప్రిల్-డిసెంబర్ మధ్య)లో దిగుమతుల వృద్ధి 25.9 శాతంగా నమోదైంది. అందుకు నాన్ పెట్రో ఉత్పత్తుల దిగుమతులు 31.9 శాతంగా ఉండటమే కారణం. పండుగల సమయంలో వెండి, బంగారానికి డిమాండ్ అధికమవడంతో... వీటి దిగుమతుల్లో 29.3 శాతం వృద్ధి నమోదైంది. పారిశ్రామికరంగ వస్తువులకు డిమాండ్ పెరిగి నందువల్ల.. ఈ రంగం నాన్ పెట్రోలియం ఉత్పత్తులను ఎక్కువగా డిమాండ్ చేయడంతో వీటి వృద్ధి 33 శాతం పెరిగింది. వాణిజ్య లోటు 2006-07లో 59.4 బిలియన్ డాలర్లు. కాగా 2007-08 మొదటి 9 నెలల్లో ఈ లోటు 57.8 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దేశ ఎగుమతుల విలువలో ప్రధానమైన పెట్రోలియం ఉత్పత్తుల వాటా.. మొత్తం దిగుమతులలో 2006-07లో 31 శాతం. కాగా మూలధన వస్తువుల వాటా 2000-01లో ఉన్న 3.7 శాతం నుంచి 2006-07లో 4.9 శాతానికి పెరిగింది. ముత్యాలు, విలువైన రాళ్ల వాటా మొత్తం దిగుమతుల విలువలో 2000-01లో 9.6 శాతం నుంచి 2006-07లో 4 శాతానికి తగ్గింది. బంగారం, వెండి వాటా 2006-07లో మొత్తం దిగుమతుల విలువలో 9.3 శాతం. 2005-06లో 7.6 శాతానికి తగ్గి, 2006-07లో 7.9 శాతానికి పెరిగింది!!